
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
సిద్దిపేట
5
బుధవారం 19 జూన్ 2024



సగం ఇళ్లకే భగీరథ!

- జిల్లాలో 63 గ్రామాలకు అందని తాగునీరు
- చాలా గ్రామాల్లో బోరుబావులే దిక్కు
- కొత్త కనెక్షన్‌ల ఊసేలేదు..
- కాలనీలదీ అదే పరిస్థితి
- పదిరోజుల సర్వేలో సమస్యల వెల్లువ



నీటి సమస్యతో కనెక్షన్లకు తొలగించిన కుళాయి

దుబ్బాక, జూన్ 18 : ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తున్నామని చెప్పిన మిషన్‌భగీరథ మంచినీటి పథకం పదేళ్లు దాటినా బాలరిష్టాలను దాటలేదు. ప్రతి ఇంటికీ మంచినీటిని అందిస్తున్నామనే గత ప్రభుత్వ ప్రకటన ఉత్త మాటేనని.. ప్రస్తుత ప్రభుత్వం చేపట్టిన సర్వేలోని నివేదికనే స్పష్టం చేస్తుంది.! సిద్దిపేట జిల్లాలోని 499 గ్రామపంచాయతీలలో సుమారు 63 గ్రామాలకు పైగా మిషన్‌భగీరథ నీరు అందడం లేదు. ఆయా గ్రామాలకు పంచాయతీ బోరుబావులే ఆధారంగా సరఫరా చేశారని సర్వేలోని నివేదికలు చెబుతున్నాయి. అధికారిక లెక్కల ప్రకారం జిల్లాలో సుమారు 2,10,605 ఇళ్లకు నీటిని అందిస్తున్నామని మిషన్ భగీరథశాఖ అధికారులు చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో సగానికి పైగా ఆయా కనెక్షన్లలో నీరు సరఫరా కావడం లేదని గ్రామకార్యదర్శులు తమ సర్వేలో పొందుపరిచారు. ప్రభుత్వం ఈనెల 10 నుంచి రాష్ట్రవ్యాప్తంగా 10 రోజుల పాటు మిషన్‌భగీరథపై సర్వే నిర్వహిస్తున్నారు. దాదాపుగా జిల్లాలోని పలు గ్రామాల్లో సర్వే పూర్తికావొచ్చింది.

సేకరిస్తున్న వివరాలు..

ఇంటియజమాని, మిషన్ భగీరథ మంచినీటి కుళాయి, ఇంటి ఫొటో, తదితర వివరాలను యాప్‌లో పొందుపరుస్తున్నారు. అలాగే జిల్లా, మండలం, గ్రామ, ఇంటియజమాని పేరు, తండ్రి/భర్త పేర్లను జతచేయడంతోపాటు కుటుంబసభ్యుల సంఖ్య, ఆడ, మగవారి సంఖ్య, మొబైల్ నంబర్, ఆధార్ నంబర్‌ను చేర్చుతున్నారు. ప్రతి ఇంటికీ నీరు అందుతుందో లేదో తెలుసుకుంటున్నారు. ప్రతి మనిషికీ 40 లీటర్ల స్వచ్ఛమైన నీరు అందుతుందా? ఎన్నిరోజులకు నీళ్లు అందుతున్నాయనే వివరాలను సేకరిస్తున్నారు.



తాగునీటి కనెక్షన్లు అస్తవ్యస్తం

2016లో అందించిన కనెక్షన్‌లు మినహా ఇప్పటి వరకు కొత్త కనెక్షన్‌లు ఇవ్వకపోవడంతో ఆయా గ్రామాల్లో కొత్తగా ఇళ్లు కట్టుకున్న వారికి మిషన్‌భగీరథ నీరు అందని మావిగానే మారింది. జిల్లాలో సుమారు 9 నుంచి 12 వేల వరకు అధికారికంగా ఇళ్ల నిర్మాణం చేపట్టినట్లు గ్రామ కార్యదర్శులు చెబుతున్నారు. వీటికి ఇప్పటి వరకు నల్లా కనెక్షన్ ఇవ్వలేదు. కొన్ని చోట్ల కనెక్షన్లు అస్తవ్యస్తంగా ఏర్పాటు చేశారు. చాలా గ్రామాల్లో కుళాయిలకు ట్యాప్‌లను తొలగించి నీటిని లాగే మోటర్లను బిగిస్తున్నట్లు తెలుస్తున్నది. ఫలితంగా గ్రామంలో ప్రతి ఇంటికి సమానంగా నీరు చేరకపోవడంతో సమస్యగానే మారింది.



మిషన్‌భగీరథ ట్యాంకు

బోరుబావులే శరణ్యం

జిల్లాలోని 63 గ్రామపంచాయతీల్లో ఇప్పటివరకు మిషన్ భగీరథ మంచినీరు సరఫరా కావడంలేదు. ప్రధానంగా జగదేవ్‌పూర్ మండలం మాందాపూర్ మదిర గ్రామం గుబ్బడిగ్రామానికి నీరు సరఫరా కావడంలేదు. అంతాయగూడ గ్రామంలో 40 వేల లీటర్ల సామర్థ్యం గల ట్యాంకు ఒకటి, 30 వేల లీటర్ల ట్యాంకు మరొకటి నిర్మించారు. ఈ రెండు వాటర్ ట్యాంకులకు ఇప్పటి వరకు మిషన్ భగీరథ నీరందించలేదు. గ్రామంలోని రెండు బోరుబావుల ద్వారానే నీటిని అందిస్తున్నారు. అక్కన్నపేట మండలం కపూర్‌నాయక్ తాండాతోపాటు మదిర గ్రామాల్లోనూ ఇదే సమస్య. చేబర్తిలో నీరు సరఫరా కాకపోవడంతో ఇటీవల బూస్టర్ పంపుద్వారా సమస్యను పరిష్కరించగలిగారు. సుమారు అన్ని గ్రామాల్లో అనుకున్న దానికంటే తక్కువగా మంచినీటి సరఫరా కావడంతో బోరుబావులే శరణ్యమయ్యాయి. ఇక జిల్లాలో అధికారులు చెబుతున్న లెక్కలకు క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలకు తేడా కనిపిస్తుంది. గ్రామపంచాయతీలే కాకుండా మున్సిపాలిటీల్లో కూడా తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. ఉన్నతాధికారులు సమస్యలను పరిశీలించి వాటి పరిష్కారానికి మార్గం చూడాలని గ్రామకార్యదర్శులు, సర్వే ద్వారా మిషన్‌భగీరథ లక్ష్యం నెరవేరి ప్రతీ గడపకు తాగునీటి అందజేయాలని ప్రజలు కోరుతున్నారు



నెలలు గడుస్తున్నా లీకేజీని వదిలేసిన అధికారులు



సిద్దిపేటలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

భగ్గుమన్న విద్యార్థి సంఘాలు

నీట్ పరీక్ష అవకతవకలపై విద్యార్థి సంఘాలు భగ్గుమన్నాయి. విద్యార్థుల జీవితాలతో ఆటలాడుతున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం సిద్దిపేటలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద పీడీఎస్‌యూ, ఎస్ఎస్‌యుఐ, ఎస్ఎఫ్ఐ, యూత్ కాంగ్రెస్ సంఘాల ఆధ్వర్యంలో మోదీకి వ్యతిరేకంగా నినదిస్తూ ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. చేర్యాల పాతబస్టాండ్ వద్ద ఎస్ఎఫ్ఐ నాయకులు అర్ధనగ్న ప్రదర్శన చేపట్టారు.

8లో

సివిల్స్ ఉచిత శిక్షణకు

దరఖాస్తుల స్వీకరణ

- జూలై 17 వరకు అవకాశం

సిద్దిపేటక్రైం, జూన్ 18 : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం షెడ్యూల్ కులాల అభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో ఉచితసివిల్స్ శిక్షణకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు జిల్లాఎస్సీ అభివృద్ధిశాఖ అధికారి కవిత తెలిపారు. హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ స్టడీ సర్కిల్‌లో రెసిడెన్షియల్‌తో కూడిన ఉచిత శిక్షణను అందజేయనున్నట్లు తెలిపారు. డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు ఈనెల 17 నుంచి జూలై 17 వరకు టీఎస్‌స్టడీసర్కిల్.కో.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు రూ.3లక్షల లోపు ఆదాయం కలిగి ఉండాలని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి జూలై 27న ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు. ఆ పరీక్షలో వచ్చిన మెరిట్ ఆధారంగా ఎస్సీ, ఎస్టీ, బీసీలకు సీట్లు కేటాయించనున్నట్లు చెప్పారు.



జాబ్‌మేళా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి పొన్నం

నిరుద్యోగ యువత జాబ్‌మేళాను

సద్వినియోగం చేసుకోవాలి

- రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్‌రూరల్, జూన్ 18: గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఈనెల 24న హుస్నాబాద్‌లోని తిరుమలగార్డెన్‌లో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన మంగళవారం జాబ్‌మేళా పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. జీరో నుంచి పీజీ వరకు చదువుకున్న యువతీ యువకులు ఈ జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దాదాపు 5వేల మంది నిరుద్యోగులకు జాబ్‌మేళా ద్వారా ఉద్యోగాలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు కేడం లింగమూర్తి, సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చిత్తారి పద్మ, జేఏసీ నాయకులు మేకల వీరన్నయాదవ్, కర్నకంటి మంజులారెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు బంక చందు, అయిలయ్య, మాజీ సర్పంచులు సంజీవరెడ్డి, కౌన్సిలర్లు వల్లపు రాజు, సరోజన పాల్గొన్నారు.

మొక్కులు చెల్లించుకున్న పొన్నం దంపతులు



హుస్నాబాద్‌లోని ప్రసిద్ధ రేణుకాఎల్లమ్మ తల్లికి మంత్రి పొన్నం ప్రభాకర్ సతీసమేతంగా మంగళవారం మొక్కులు చెల్లించుకున్నారు. మంత్రి సతీమణి మంజుల అమ్మవారికి బోనంతో నైవేద్యం సమర్పించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులతో ముచ్చటించారు. చిన్నారులను ఎత్తుకుని వారిని ముద్దుచేశారు. కొందరు భక్తులు మంత్రి పొన్నం ప్రభాకర్‌తో సెల్ఫీలు దిగేందుకు పోటీ పడ్డారు.

ఆర్వీఎం బీఎస్సీ నర్సింగ్ విద్యార్థుల ధర్నా

ములుగు, జూన్ 18: ఆర్వీఎం నర్సింగ్ కళాశాలలో బీఎస్సీ నర్సింగ్ మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థులను అధ్యాపకులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపిస్తూ మంగళవారం ధర్నా చేపట్టారు. ములుగు మండల పరిధిలోని లక్ష్మక్కపల్లి ఆర్వీఎం మెడికల్ కాలేజీలో బీఎస్సీ నర్సింగ్ మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థులను అధ్యాపకులు అసభ్య పదజాలంతో దూషిస్తూ వ్యక్తిగతంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. కళాశాల సీఈవో శ్రీనివాస్ విద్యార్థులకు నచ్చజెప్పారు. మరోసారి ఇలా జరగకుండా చూసుకుంటామని, విద్యార్థులతో దురుసుగా ప్రవర్తించిన అధ్యాపకులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో విద్యార్థులు ఆందోళన విరమించారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న యాజమాన్యం

వర్షం కోసం.. బతుకమ్మ ఆట



వర్షాలు కురవాలని కోరుతూ తొగుట మండలం ఎల్లారెడ్డిపేట తాటోనికుంటలో మంగళవారం ఉపాధిహామీ పనులు చేస్తున్న మహిళలు బతుకమ్మ ఆడుతూ వరుణ దేవున్ని వేడుకున్నారు. కొన్నిరోజుల క్రితం అకాల వర్షాలు కురిసి ఆ తర్వాత చినుకు జాడ లేకపోవడంతో పంటలు ఎండుముఖం పడుతున్నాయి.

- తొగుట

ఖాళీ జాగా.. వేసేయ్ చెత్త

- సిద్దిపేటలో ఎక్కడ పడితే అక్కడే
- ఇంటింటికీ సేకరణకు వస్తున్న వాహనాలకు అందించని పలు కాలనీవాసులు
- పట్టణ శివారులో కుప్పలుగా దర్శనం
- చోద్యం చూస్తున్న మున్సిపల్ అధికారులు



సిద్దిపేట పట్టణ శివారులో చెత్త పడేస్తున్న వ్యక్తి

సిద్దిపేట టౌన్, జూన్ 18: "చెత్త బండి వచ్చిందమ్మా...చెత్త బండి వచ్చింది.. రావాలి త్వరగా రావాలి.. తడిచెత్త, పొడి చెత్త వేర్వేరుగా తీసుకుని రావాలమ్మా" అంటూ కోడి కూసింది మొదలు మున్సిపల్ సిబ్బంది సిద్దిపేట పట్టణంలోని 43 వార్డుల్లో చెత్త సేకరిస్తున్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో సిద్దిపేట పట్టణాన్ని దేశంలోనే అగ్రభాగాన నిలిపేందుకు చేస్తున్న కృషికి పట్టణవాసులు కొందరు తూట్లుపొడిచేలా వ్యవహరిస్తున్నారు. చెత్త సేకరణకు వచ్చే వాహనాలకు తమ ఇంట్లో నుంచి వెలువడిన తడి, పొడి చెత్తను ఇవ్వకుండా వార్డుల్లోని ఖాళీస్థలాల్లో, పట్టణ శివారులో ఇష్టానుసారంగా పడేస్తున్నారు. గాలికి ఆ చెత్త చెల్లాచెదరవుతుండడంతో పాటు దుర్గంధం వెదజల్లుతున్నది.

ఇంటింటికీ చెత్త సేకరణ

సిద్దిపేట పట్టణం అందంగా ఉండేందుకు మున్సిపల్ కౌన్సిల్, అధికారులు పట్టణంలోని 43 వార్డుల్లో ఇంటింటికీ చెత్తసేకరణ చేస్తున్నారు. తడి చెత్త 26.8 టన్నులు, పొడి చెత్త 16.50 టన్నులు, క్లాత్ అండ్ డైపర్స్ 1.7 టన్నులు, శానిటరీ ప్యాడ్ 1.2 టన్నులు, కెమికల్ వేస్టేజ్ 1.4 టన్నులు, సిల్ట్ 6.85 టన్నులు, దీంతో మొత్తంగా 54.45 టన్నులు సేకరిస్తున్నారు. ప్రతిరోజూ ఉదయం చెత్త సేకరించే వాహనానికి కొందరు ఆ సమయానికి లేవకపోవడంతో చెత్తను అందించడం లేదు. దీంతో రాత్రి సమయంలో ఎవరికి కనిపించకుండా వెళ్లి ఆయా వార్డుల్లో ఖాళీస్థలాల్లో, పట్టణ శివారులోని రోడ్డు పక్కన పడేస్తున్నారు.



ఖాళీస్థలంలో చెత్త పడేసిన గుర్తుతెలియని వ్యక్తులు

జరిమానాలేవి

గతంలో ఆరుబయట చెత్తవేస్తే జరిమానా విధించిన మున్సిపల్ అధికారులు, నేడు ఎక్కడపడితే అక్కడ చెత్త వేస్తున్నా పట్టించుకున్న పాపానా పోవడంలేదని ఆయా కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. పట్టణంలోని నలుమూలలా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల నుంచి పోలీసుల సహకారంతో చెత్త వేస్తున్న వారిని గుర్తించి, చెత్త సేకరిస్తున్న తీరు, స్వచ్ఛ సిద్దిపేట కోసం శ్రమిస్తున్న సిబ్బంది, అధికారుల పనితీరులపై అవగాహన కల్పించి మరోసారి ఆరుబయట చెత్త వేయకుండా జరిమానా విధించేవారు. కొద్ది నెలల నుంచి అధికారులు షరా మాములే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు.

స్వచ్ఛ సిద్దిపేట పేరు దిగజార్చుతున్నవైనం

మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు సూచనల మేరకు మున్సిపల్ పాలకవర్గం, అధికారులు అమలు చేస్తూ దేశంలో, రాష్ట్రంలో సిద్దిపేట కీర్తి చాటేలా పలు అవార్డులను కైవసం చేసుకున్నారు. 2012 నుంచి 2024 వరకు స్వచ్ఛ సర్వేక్షణ్‌లో పలు విభాగాల్లో సిద్దిపేట మున్సిపల్ దాదాపు 22 అవార్డులను కైవసం చేసుకుంది. కేంద్రంలో, రాష్ట్రంలో ఏ అవార్డు ఉన్నా సరే అందులో సిద్దిపేట పేరు లేకుండా అవార్డులే ఉండవు అన్నంతగా కీర్తి, ప్రతిష్ఠలు సాధించుకుంది. ప్రస్తుతం కొందరు ఆరుబయట చెత్త పడేస్తూ స్వచ్ఛ సిద్దిపేట పేరును దిగజార్చుతున్న వారిని గుర్తించి తగిన చర్యలు తీసుకోవాల్సిన చర్యలు మున్సిపల్ అధికారులు సిబ్బందిపై ఉంది.

తెరపైకి కొత్త ఠాణాలు

- టూ టౌన్, మల్లన్నసాగర్‌స్టేషన్ల ఏర్పాటుకు కసరత్తు
- గతంలో ప్రతిపాదనలు
- తాజాగా తెరపైకి అంశం
- మల్లన్నసాగర్ పునరావాస కాలనీ ఏర్పాటుతో పెరిగిన పట్టణ జనాభా
- ఊపందుకుంటున్న డిమాండ్



గజ్వేల్ పట్టణం

గజ్వేల్, జూన్ 18 : గత ప్రభుత్వ హయాంలో పురుడుపోసుకున్న కొత్త పోలీస్‌స్టేషన్ల ఏర్పాటు అంశం తాజాగా మరోసారి తెరపైకి వచ్చింది. గతంలో టూటౌన్‌తో పాటు పోలీస్ క్వార్టర్స్ ఏర్పాటుకు అధికారులు స్థలాలను పరిశీలించడంతో పాటు ఏర్పాటుకు సంబంధించిన అంశాలపై సవివరంగా ఉన్నతాధికారులకు నివేదించారు. అనంతరం ప్రభుత్వం సదరు పోలీస్‌స్టేషన్ల అంశంపై దృష్టిసారించకపోవడంతో స్టేషన్ల ఏర్పాటు అంశం నీరుగారింది. తాజాగా గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి పోలీస్‌స్టేషన్ల ఏర్పాటు అంశంపై పలువురు నాయకులతో చర్చించడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకువెళ్లడంతో మరోసారి పోలీస్‌స్టేషన్ల ఏర్పాటు అంశం తెరపైకి వచ్చింది.

పోలీసులకు ఇబ్బందిగా మారిన గజ్వేల్

గజ్వేల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీతో పాటు 26 గ్రామాలుండగా, ఏడు మల్లన్నసాగర్ ముంపు గ్రామాలు, కొత్తగా బైపాస్, రైల్వేలైన్ అందుబాటులోకి రావడం ఇక్కడ పోలీసులకు విధులు నిర్వహించడం కత్తి మీద సాములా మారింది. గజ్వేల్ రూరల్/టౌన్‌తో పాటు మల్లన్నసాగర్ ముంపు గ్రామాలకు ప్రత్యేకంగా పోలీస్‌స్టేషన్‌ను ఏర్పాటు చేస్తేనే సమస్య పరిష్కారమయ్యే అవకాశాలున్నాయి. సిబ్బంది, అధికారుల నియామకం జరగకపోవడంతో ఉన్న సిబ్బందే కష్టపడాల్సి వస్తుంది. గజ్వేల్ పోలీస్‌స్టేషన్‌లో ఇద్దరు సీఐలు, నలుగురు ఎస్ఐలకు ఇద్దరు, ఆరుగురు ఏఎస్ఐలకు గాను నలుగురు, ఆరుగురు హెడ్ కానిస్టేబుళ్లు, 70మంది కానిస్టేబుళ్లకు గాను 40మంది మాత్రమే ఉన్నారు. వారిలో కూడా పలువురు డిప్యూటేషన్ ఇతర వింగ్‌లలో పనిచేస్తుండడంతో కొందరు మాత్రమే పూర్తిస్థాయిలో విధులు నిర్వహిస్తున్నారు. 2020కి ముందు ఏడాదిలో 300 కేసులు నమోదయితే ప్రస్తుతం ఈ సంఖ్య 800 పెరిగింది. రోజువారీ ఫిర్యాదుల సంఖ్య గతంలో రెండు, మూడు ఉంటే ప్రస్తుతం ఈ సంఖ్య పది దాటింది. దీంతో సిబ్బందికి ఇబ్బందులు తప్పడం లేదు.



గజ్వేల్ పోలీస్ స్టేషన్

గతంలోనే ప్రతిపాదనలు పంపిన జిల్లా యంత్రాంగం

గతంలో జిల్లాల విభజన సమయంలో 2016లో ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌తో పాటు రూరల్ పోలీస్‌స్టేషన్‌కు ప్రతిపాదనలు పంపారు. కానీ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటైనా, రూరల్ పోలీస్‌స్టేషన్‌ను పట్టించుకోలేదు. ఇక 2021-22 సంవత్సరంలోనే గజ్వేల్ రూరల్ స్టేషన్‌కు అధికారులు ప్రతిపాదనలు పంపించారు. ఈ స్టేషన్లతో పాటు పోలీస్‌క్వార్టర్లు, ఇతరత్రా వినియోగాల నిమిత్తం పలు స్థలాలను పరిశీలించారు. ఈ ప్రతిపాదనలు అక్కడికే పరిమితమయ్యాయి. రోజురోజుకూ పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా సర్కిళ్ల పునర్విభజన, పోలీస్‌స్టేషన్ల ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మల్లన్నసాగర్‌తో పెరిగిన జనాభా, పట్టణ ట్రాఫిక్

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీలో మల్లన్నసాగర్ ముంపు గ్రామాలైన తొగుట మండలంలోని రాంపూర్, లక్ష్మాపూర్, వేములఘాట్, బ్రాహ్మణబంజేరుపల్లి, పల్లెపహాడ్, ఏటిగడ్డ కిష్టాపూర్, కొండపాక మండలంలోని సింగారం, ఎర్రవల్లి గ్రామాలు వచ్చి చేరాయి. ఇక కొండపోచమ్మ సాగర్ ముంపు గ్రామాలైన బైలంపూర్, మామిడ్యాల, తానేదార్‌పల్లి గ్రామాల నుంచి అనేక మంది ప్రజలు కొండపోచమ్మ సాగర్ పునరావాస కాలనీకి వెళ్లకుండా పిల్లల చదువు, గజ్వేల్‌లో వ్యాపారం, ఉద్యోగాలు ఉన్న పలువురు గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీలో స్థిరపడ్డారు. ఈ క్రమంలో గజ్వేల్‌లో జనాభా భారీగా పెరిగింది. గతంలో 40వేల జనాభా ఉండగా, ప్రస్తుతం ఈ సంఖ్య లక్షకు చేరింది. దీంతో పోలీసుశాఖ పునర్విభజన అనివార్యంగా మారిన నేపథ్యంలో త్వరలోనే ముందడుగు పడుతుందా? లేక గతంలోలా ఊరిస్తారా? వేచి చూడాలి.

పక్షపాత పోలీసులపై చర్యలు తీసుకోండి

● డీజీపీకి వీహెచ్‌పీ వినతి

హైదరాబాద్, జూన్18 (ఆంధ్రజ్యోతి): బక్రీద్ సందర్భంగా పక్షపాత ధోరణితో వ్యవహరించిన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని వీహెచ్‌పీ, డీజీపీ రవిగుప్తాను కోరింది. సదరు పోలీసు అధికారులు పనిగట్టుకుని హిందువులపై అక్రమ కేసులు పెట్టారని ఫిర్యాదు చేసింది. ముఖ్యంగా మెదక్ పట్టణంలో పోలీసుల అలసత్వం కారణంగా అల్లర్లు జరిగాయని, అల్లర్లలో దోషులను వదిలిపెట్టి.. బాధితులను రిమాండ్ చేసిన పోలీసులను వెంటనే సస్పెండ్ చేయాలని వీహెచ్‌పీ విజ్ఞప్తి చేసింది. ఈ సందర్భంగా వీహెచ్‌పీ రాష్ట్ర ప్రచార ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి, భజరంగ్ దళ్ రాష్ట్ర కన్వీనర్ శివరాములు డీజీపీ రవిగుప్తాను ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. మెదక్‌లో ఆవుల విషయమై స్థానిక ఇన్‌స్పెక్టర్ కారణంగా కత్తిపోట్లు.. పెద్దఎత్తున అల్లర్లు జరిగాయన్నారు. చాదర్‌ఘాట్, ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో పోలీసులు దోషులను వదలిపెట్టి, వీహెచ్‌పీ, భజరంగదళ్ కార్యకర్తలను బెదిరిస్తున్నారని వారు డీజీపీకి ఫిర్యాదు చేశారు. ఖమ్మం జిల్లాలో ఆవులను మితిమీరి ఒకే వాహనంలో ఎక్కించడం వల్ల, తొక్కిసలాటకు గురై 12 ఆవులు చనిపోయాయన్నారు.

ఉరేసుకుని గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

జహీరాబాద్, జూన్ 18: ఉరేసుకుని గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడని పట్టణ ఎస్‌ఐ లక్ష్మారెడ్డి తెలిపారు. అహ్మద్‌నగర్ కాలనీ సమీపంలోని చెట్ల పొదల్లో కానుగ చెట్టుకు 45 ఏళ్ల వయస్సున్న వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడని స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని కిందికి దింపి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతదేహం పూర్తిగా నల్లబడిపోయిందని, గుర్తు పట్టేందుకు వీలు లేకుండా ఉన్నదన్నారు. వ్యక్తికి సంబంధించిన వారెవరైనా ఉంటే 8712656763 నెంబరులో సంప్రదించాలన్నారు.

అనుమతులు లేని పాఠశాలలపై చర్యలకు డిమాండ్

నారాయణఖేడ్, జూన్ 18: అనుమతి లేని ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని అఖిల భారత ప్రజాతంత్ర్య విద్యార్థి సమాఖ్య ఉమ్మడి మెదక్ జిల్లా కార్యదర్శి తెంకటి కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం ఖేడ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఉమ్మడి మెదక్ జిల్లాలో అనుమతులు లేని పాఠశాలలు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయన్నారు. పాఠశాలల్లో సదుపాయాలు సక్రమంగా లేకపోయినా ఇరుకు భవనాల్లో ఏర్పాటు చేస్తూ విద్యార్థులకు నరకం చూపుతున్నారన్నారు. అనుమతిలేని పాఠశాలలపై అధికారులు చర్యలు తీసుకోకపోతే.. ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు సురేందర్, మహేష్, వేణు పాల్గొన్నారు.

కూచనపల్లిలో వ్యక్తి దారుణ హత్య




హత్యకు గురైన నర్సయ్య, నర్సయ్య(ఫైల్)

హుస్నాబాద్‌రూరల్, జూన్ 18: సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం కూచనపల్లి గ్రామంలో దారుణం చోటుచేసుకున్నది. గీకురు నర్సయ్య(55) అనే వ్యక్తి సోమవారం రాత్రి తన ఇంట్లో మంచంలో నిద్రిస్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు గొడ్డలితో నరికి చంపారు. అర్ధరాత్రి రెండు గంటల ప్రాంతంలో నిద్రలేచిన భార్య ఎల్లవ్వ ఈ విషయాన్ని పక్కింటి వాళ్లకు తెలిపింది. మంగళవారం ఉదయం హత్య సంఘటన విషయాన్ని గ్రామస్థులు పోలీసులకు తెలియజేశారు. ఎస్‌ఐ మహేష్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీం, డాగ్‌స్క్వాడ్‌ను రప్పించారు. పంచనామా చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హుస్నాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. నర్సయ్య ఎవరితో గొడవపడే వాడుకాదని గ్రామస్థులు తెలిపారు. నర్సయ్యకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కుటుంబ కలహాల వల్లే ఈ హత్య జరిగి ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు. ఇందుకు సంబంధించి నర్సయ్య భార్య, ఇంకో వ్యక్తిని పోలీసులు విచారిస్తున్నట్లు తెలిసింది. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

అప్పులబాధతో వ్యక్తి ఆత్మహత్య

హుస్నాబాద్‌రూరల్, జూన్ 18: అప్పులబాధతో ఓ వ్యక్తి మంగళవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. హుస్నాబాద్ పట్టణంలోని బుడగజంగాల కాలనీకి చెందిన చెన్నూరు సమ్మయ్య(35) కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. సమ్మయ్యకు భార్య ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. పెద్ద కూతురు వివాహానికి కొంత అప్పుచేశాడు. చిన్న కూతురు, కుమారుడికి రేచీకటి ఉండడంతో సమ్మయ్య నిత్యం తమ కుటుంబాన్ని తలుచుకుని దిగులు చెందేవాడు. రోడ్డు వెంట ఉన్న ఖాళీసీసాలు, ప్లాస్టిక్ కవర్లు ఏరుకుంటూ అమ్ముకుని వచ్చిన డబ్బుతో కుటుంబాన్ని పోషించుకునేవాడు. అయితే పెద్ద కూతురు పెళ్లికి చేసిన అప్పులు ఎలా తీర్చాలని నిత్యం మదనపడేవాడు. సోమవారం రాత్రి ఇంటి నుంచి వెళ్లిన సమ్మయ్య మంగళవారం ఉదయం కరీంనగర్ రోడ్డులో ఓ చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు సంఘటనా స్థలం వద్దకు చేరుకుని బోరున విలపించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హుస్నాబాద్ ఆస్పత్రికి తరలించారు.

ప్రమాదవశాత్తు నీటి సంప్‌లో పడి యువకుడి మృతి

జిన్నారం, జూన్ 18: ప్రమాదవశాత్తు నీటి సంప్‌లో పడి యువకుడు మంగళవారం మృతిచెందాడు. కౌడిపల్లి మండలం రాజ్‌పేటకు చెందిన శ్రీకాంత్(26) ఉపాధి నిమిత్తం గడ్డపోతారం వచ్చి పశువుల కాపరిగా పనిచేస్తున్నాడు. కాగా మంగళవారం ఉదయం పశువులను కాస్తుండగా వర్షాలకు నిండిన కుంటలో పడ్డాడు. గడ్డపోతారం శివారులో ఉన్న సంప్ వద్దకు వెళ్లి.. బురదను శుభ్రం చేసుకునే క్రమంలో ప్రమాదవశాత్తు అందులో పడి మృతిచెందాడు. స్థానికుల సమాచారంతో బొల్లారం పోలీసులు ఘటనా స్థలాన్ని చేరుకుని మృతదేహాన్ని వెలికి తీసి కేసు నమోదు చేశారు.

ఆహ్లాదం కరువు..
అభివృద్ధి బరువు

- అలంకారప్రాయంగా పార్కులు
- పిచ్చిమొక్కలు.. పొదలు
- వెంచర్లలోనూ కనిపించని పార్కులు

జహీరాబాద్, జూన్ 18: సంగారెడ్డి జిల్లాలో జహీరాబాద్ పట్టణం అన్నిరంగాల్లో అంచెలంచెలుగా అభివృద్ధి చెందుతున్నా.. ప్రజలకు ఆహ్లాదాన్ని పంచే పార్కులు మాత్రం అభివృద్ధికి నోచుకోవడం లేదు. నిధుల కొరత, పర్యవేక్షణాలోపం తదితర కారణాలు వెరసి పార్కుల అభివృద్ధిని మాత్రం పాలకులు, అధికారులు విస్మరిస్తున్నారు. అధికారుల రికార్డుల్లో మాత్రం పట్టణంలో సుమారు 58 పార్కులు ఉన్నట్లు చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో వాటిని పరిశీలిస్తే వినియోగం ఏమేరకు ఉందో స్పష్టంగా అవగతమవుతుంది.

ముఖ్యంగా జహీరాబాద్ పట్టణం సుమారు 65 కిలో మీటర్ల మేరకు విస్తరించి ఉండడంతో పట్టణం చుట్టుపక్కల అనుమతులున్న వెంచర్లు కొన్నైతే.. మరికొన్ని తమ ఫైల్ డీటీసీపీ అధికారుల(హైదరాబాద్) వద్ద ఉందంటూ దర్జాగా నిర్మాణాలు చేస్తున్నారు. ప్రతీ వెంచర్ కోసం కేటాయించిన విస్తీర్ణంలో 10 శాతం పార్కులకు కేటాయించి, మిగతా స్థలంలో అభివృద్ధి చేయాలి. అధికారుల రికార్డుల్లో మాత్రం పార్కు స్థలం కనిపిస్తుంది. క్షేత్రస్థాయిలో పరిస్థితులకు విరుద్ధంగా ఉంటాయి. అందులో కొన్ని పార్కులు కుచించుకుపోవడం, మరికొన్ని పార్కులు అభివృద్ధికి నోచుకోలేక అలంకార ప్రాయంగా తయారయ్యాయి. ఉన్న పార్కులకు తోడుగా కొత్త పార్కులు వినియోగంలోకి రాకపోవడంతో పట్టణంలో స్వచ్ఛమైన వాతావరణం కరువైందని పర్యావరణ నిపుణులు పేర్కొంటున్నారు.

అధికారుల లెక్కల ప్రకారం 58 పార్కులు

జహీరాబాద్ పట్టణ విస్తీర్ణాన్ని బట్టి సుమారు 100 పార్కులు ఉండాలి. అయితే అధికారుల లెక్కల ప్రకారం ప్రస్తుతం 58 పార్కులు 200 పైచిలుకు ఎకరాల్లో విస్తరించి ఉన్నాయి. అధికారికంగా ఉన్న 58 వెంచర్ల ప్రకారం 58 పార్కులు ఉండగా.. అనధికారంగా సుమారు 20కిపైగానే వెంచర్లు ఉన్నా.. అందులో పార్కులకు సంబంధించిన స్థలాన్ని ఏర్పాటు చేయలేకపోయారు. ఆయా పార్కుల స్థలాల్లో రాళ్లను ఏర్పాటు చేసి అమ్మకాలకు తెరలేపుతున్నారు. పట్టణంలో 37 వార్డులు ఉండగా ప్రతివార్డులో ఓపార్కు తప్పకుండా ఉండాలి. దీంతోపాటు అదనంగా ఏర్పాటవుతున్న వెంచర్లలో వెంచర్‌కో పార్కు చొప్పున ఏర్పాటు చేయాలి. ఉన్న పార్కుల్లో కొన్ని కుచించుకుపోగా.. మరికొన్ని వెంచర్లలో నిర్వాహకులు ప్లాట్లుగా ఏర్పాటు చేసి.. పార్కు స్థలాలను సైతం విక్రయించినట్లు ఆరోపణలున్నాయి. మున్సిపల్ అధికారులు దృష్టిపెట్టకపోవడంతోనే పట్టణంలోని పార్కులన్నీ అలంకార ప్రాయంగా మారుతున్నాయి.



వసంతవిహార్‌లో ఏర్పాటుచేసిన పార్కులో పిచ్చిమొక్కలు



పచ్చదనం లేక బోసిపోయిన ఆదర్శనగర్ పార్కు



పట్టణంలోని హౌజింగ్‌బోర్డులో గల పార్కులో ఎండిపోయిన చెట్లు, అధ్వానంగా మారిన పార్కు

మందుబాబులకు అడ్డాగా..

ఆహ్లాదాన్ని పంచాల్సిన పార్కులు మందుబాబులకు అడ్డాలుగా తయారయ్యాయి. ఆయా పార్కుల్లో మరుగుదొడ్లు, మూత్రశాలలు, వాచ్‌మెన్ ఏర్పాటు తదితరాలు ఉండాలి. ప్రస్తుతమైతే ఏ పార్కులోనూ అలాంటి సౌకర్యాలు లేవు. దీంతో పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి పాములు, తదితర విష పురుగులు రావడంతో అందులోకి వెళ్లలేకపోతున్నామని స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పార్కులను అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.

త్వరలో పార్కులన్నీ అభివృద్ధి చేస్తాం



మున్సిపాలిటీలో నిధులకొరత కారణంగా పార్కులను అభివృద్ధి చేయాలంటే ఇబ్బందిగా ఉంది. పట్టణంలో ఉన్న పార్కులన్నింటిని పరిశీలిస్తున్నం. పార్కులన్నింటిని ప్రజలకు వినియోగంలోకి వచ్చేలా చూస్తం. పట్టణంలో అక్కడక్కడ పార్కులు కబ్జాలకు గురవుతున్నట్లు తమ దృష్టికి వచ్చింది. వాటన్నింటిపై దృష్టిపెడుతున్నం. కబ్జాకుగురైతే వెంటనే స్వాధీనం చేసుకునేలా చర్యలకు ఉపక్రమిస్తం. ఇళ్ళ మధ్యలో పార్కులు ఉంటే చుట్టుపక్కల గల ప్రజలకు అహ్లాదకరమైన వాతావరణాన్ని అందిస్తాయి. పార్కులను అభివృద్ధి చేసి కాపాడుకుందాం. పట్టణ ప్రజలు కూడ పార్కుల పరిరక్షణకు అధికారులకు సహకరించాలి.

- శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్

'వసతులు లేని తెలంగాణ కాలనీ' కథనానికి స్పందన

- జిల్లా, మండల అధికారుల ఆదేశాలతో కాలనీలో పర్యటించిన ఈవో
- ఎక్స్‌కవేటర్‌తో పిచ్చిమొక్కల తొలగింపు

జిన్నారం, జూన్ 18: 'వసతులకు నోచుకోని తెలంగాణ కాలనీ' అని మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి జిల్లా, మండల పంచాయతీరాజ్ శాఖ అధికారులు స్పందించారు. డీపీవో, ఎంపీవో ఆదేశాల మేరకు గడ్డపోతారం ఈవో వెంకట్ తెలంగాణ కాలనీని సందర్శించారు. స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎక్స్‌కవేటర్‌తో నివాసాల మధ్య ఉన్న పిచ్చి మొక్కలు, అపరిశుభ్రతను తొలగించారు. రెండురోజుల్లో కాలనీవాసులతో సమావేశమై సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఈవో తెలిపారు.



గడ్డపోతారం తెలంగాణ కాలనీలో ఎక్స్‌కవేటర్‌తో పిచ్చి మొక్కలు తొలగిస్తున్న ఈవో వెంకట్, సిబ్బంది

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అక్రమంగా తరలిస్తున్న ఆవులు పట్టివేత

- కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకుల డిమాండ్



పోలీస్‌స్టేషన్ వద్ద విలేకరులతో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

చిలప్‌చెడ్, జూన్ 18: అక్రమంగా తరలిస్తున్న ఆవులను పట్టుకుని రవాణా చేస్తున్న వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ షేక్ మహబూబ్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. అర్ధరాత్రి సమయంలో సోమక్కపేట గ్రామం నుంచి (ఏపీ 29 యూ 6063) నెంబరు గల బొలెరో వాహనంలో మహ్మద్ అక్బర్, మన్నె దశరథ రెండు ఆవులను తరలిస్తూ పట్టుబడ్డారు. దీంతో వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించి వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ విషయమై బీజేపీ నాయకులు మాట్లాడుతూ ఆవులను తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎస్‌హెచ్‌వోకు వినతిపత్రం అందజేశారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజేందర్, ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యనారాయణగౌడ్, మాణిక్య గౌడ్ తదితరులు వినతిపత్రం అందజేసినవారిలో ఉన్నారు.

అంతర్జాతీయ యోగా దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ



దశాబ్ది అంతర్జాతీయ యోగా దినోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మనుచౌదరి, మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట టౌన్, జూన్ 18: దశాబ్ది అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా మంగళవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో వేడుకకు సంబంధించిన పోస్టర్‌ను కలెక్టర్ మనుచౌదరి, మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ సిద్దిపేట ప్రభుత్వ బాలికల కళాశాల స్టేడియంలో ఈనెల 21న ఉదయం 5.30 గంటలకు యోగా దినోత్సవం జరుగుతుందని తెలిపారు. యోగా సంస్థలు, సేవా సంస్థలు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, అధికారులు, ప్రజాప్రతినిధులు భారీ సంఖ్యలో పాల్గొంటున్నట్లు తెలిపారు. ఈ ఉత్సవాల్లో అన్నివర్గాల వారు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్, భారత్ స్వాభిమాన్ ట్రస్టు, వ్యాస మహర్షి యోగా సొసైటీ ప్రతినిధులు తోట అశోక్, నిమ్మ శ్రీనివాస్‌రెడ్డి, తోట సతీష్, అయిత అంజయ్య, కల్లేపల్లి శ్రీనివాస్, తోట సంధ్య, హరిప్రసాద్, శశికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ స్టడీ సర్కిల్‌లో సివిల్ సర్వీసెస్ ఉచిత శిక్షణ

సంగారెడ్డి అర్బన్, జూన్ 18: బీసీ స్టడీ సర్కిల్‌లో సివిల్ సర్వీసెస్ పరీక్ష(ప్రిలిమ్స్ కమ్ మెయిన్స్) 2025 కోసం ఉచిత లాంగ్‌టర్మ్ శిక్షణ ఇవ్వనున్నట్లు సంగారెడ్డి బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ టి.ప్రవీణ్ ఒక ప్రకటనలో తెలిపారు. సంగారెడ్డి, మెదక్ జిల్లాలకు చెందిన నిరుద్యోగ యువతీ, యువకులు ఆన్‌లైన్‌లో ఈ నెల 19వ తేదీ నుంచి వచ్చే నెల 3వ తేదీవరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల కుటుంబ వార్షిక ఆదాయం రూ.5 లక్షలకు మించరాదన్నారు. అర్హులైన అభ్యర్థుల నుంచి 100 మంది ప్రతిభావంతులను ఎంపిక చేసి వచ్చేనెల 7న అర్హత పరీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు. శిక్షణ తరగతులు వచ్చేనెల 18వ తేదీ నుంచి 2025 ఏప్రిల్ 18వ తేదీవరకు హైదరాబాద్‌లోని సైదాబాద్ లక్ష్మీనగర్ కాలనీలోని బీసీ స్టడీ సర్కిల్‌లో నిర్వహించబడతాయని తెలిపారు. వివరాలకు 08455-277105, 9949592991 నంబరును సంప్రదించాలని ఆయన కోరారు.

వ్యాధుల కాలం.. జర పైలం

- పొంచి ఉన్న డెంగీ, మలేరియా ముప్పు
- అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్న వైద్యులు




చిన్నకోడూరు, జూన్ 18: వేసవి కాలం నుంచి వర్షాకాలానికి సీజన్ మార్పు నేపథ్యంలో వాతావరణ మార్పుల కారణంగా చిన్న పిల్లలు, వృద్ధులకు పలు రకాల వ్యాధులు ప్రబలే ఆవకాశం ఉంది. దీంతో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.

వ్యాధికారకాలను నియంత్రించాలి

వర్షాకాలం, చలికాలం ఈ రెండు కాలాలు చిన్న పిల్లలకు, వృద్ధులకు గడ్డు కాలాలని వైద్యులు చెబుతున్నారు. వర్షాకాలం ఆరంభం కావడంతో వ్యాధుల విజృంభణకు ఆస్కారం ఉంది. ఫ్లూ విషయంలో ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. పిల్లలు, వృద్ధులు, గర్భిణులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారిలో ఫ్లూ దాడిచేస్తుంది. ముక్కు కారటం, జలుబు, దగ్గు, ప్రధాన లక్షణాలు. అదేవిధంగా వర్షాకాలంలో డెంగీ, మలేరియా వ్యాధులు వస్తుంటాయి. దీనికి ప్రధాన కారణం దోమలు. ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో పారిశుధ్య మెరుగునకు చర్యలు చేపడితే సమస్యను అధిగమించే వీలుంటుందని నిపుణులు సూచిస్తున్నారు. గ్రామాల్లో మురుగు నీరు నిల్వ ఉండకుండా పంచాయతీ సిబ్బంది నిత్యం పర్యవేక్షణ చేపట్టాలి.

పిల్లలకు, వృద్ధులకు వచ్చే వ్యాధులు

వైరల్ ఫీవర్స్, టైఫాయిడ్, డెంగీ, మలేరియా, వృద్ధులకు డయేరియా, వివిధ రకాల ఇన్‌ఫెక్షన్లు, తలనొప్పి, జ్వరం, ఒంటినొప్పులు వస్తాయి.



ప్రతి ఫ్రైడే డ్రై డేగా చేసుకోవాలి



సీజన్ మార్పు నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి. కూలర్లు, టైర్లలో, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. ప్రతి ఫ్రైడే డ్రై డేగా చేసుకోవాలి. ఆరోగ్యపరంగా ఏమైనా సమస్యలుంటే ఆస్పత్రికి వచ్చి పరీక్షలు చేయించుకోవాలి.

- డాక్టర్ సరిత, పీహెచ్‌సీ వైద్యురాలు, చిన్నకోడూరు


ఆగి ఉన్న కారును ఢీకొట్టిన మరో కారు

ధ్వంసమైన కార్లు

చేగుంట, జూన్ 18: బైపాస్ వద్ద ఆగి ఉన్న కారును మరోకారు వెనకనుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరు పిల్లలకు స్వల్పగాయాలయ్యాయి. ఈ సంఘటన చేగుంట మండలం వడియారం బైపాస్ వద్ద మంగళవారం చోటు చేసుకున్నది. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి నిజామాబాద్ వైపు వెళ్తున్న కారు పంక్చర్ కావడంతో బైపాస్ పక్కన నిలిపారు. ఇంతలో హైదరాబాద్ నుంచి నిజామాబాద్ వైపు వెళ్తున్న మరో కారు ఆగి ఉన్న కారును వెనక నుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరు పిల్లలకు గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. ప్రమాదానికి గురైన కార్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

అనారోగ్యంతో నిప్పంటించుకుని వ్యక్తి ఆత్మహత్య



దశరథ్‌రెడ్డి (ఫైల్)

ఝరాసంగం, జూన్ 18: అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తి నిప్పంటించుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని గుంతమర్పల్లి గ్రామశివారులో మంగళవారం చోటు చేసుకున్నది. ఏఎస్‌ఐ గంగయ్య వివరాల ప్రకారం.. మునిపల్లి మండలంలోని తాటిపల్లి గ్రామానికి చెందిన దశరథ్‌రెడ్డి(45) పైల్స్(అర్షమొలల)తో బాధపడుతున్నాడు. ఈ నెల 17న ఇంటి నుంచి సైకిల్‌పై వెళ్లిన దశరథ్‌రెడ్డి తిరిగిరాలేదు. కుటుంబీకులు చుట్టుపక్కల, బంధువుల వద్ద గాలించినా ఆచూకీ లభించలేదు. దశరథ్‌రెడ్డికి ప్రతిరోజూ రామమందిరానికి దర్శనం కోసం వెళ్లే అలవాటు ఉన్నది. కాగా గుంతమర్పల్లి గ్రామశివారులో గల రామాలయం వద్దకెళ్లి.. పరిసర ప్రాంతాలను పరిశీలించగా కాలిపోయిన స్థితిలో దశరథ్‌రెడ్డి మృతదేహం కనిపించింది. స్థానికుల ద్వారా సమాచారమందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జహీరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి భార్య విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టామని ఎస్‌ఐ వివరించారు.

ప్రజలు ఆరోగ్యంగా ఉంటేనే దేశం బాగుంటుంది

- ఈ నెల 20 నుంచి 27వరకు జాతీయ నులిపురుగుల దినోత్సవం
- వర్గల్ ఎంపీపీ లత రమేశ్‌గౌడ్, జడ్పీటీసీ బాలుయాదవ్

వర్గల్, జూన్ 18: గ్రామాల్లోని ప్రజలు ఆరోగ్యంగా ఉంటేనే సమాజంతో పాటు దేశం బాగుంటుందని వర్గల్ ఎంపీపీ లత రమేశ్‌గౌడ్, జడ్పీటీసీ బాలు యాదవ్ పేర్కొన్నారు. వర్గల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం జాతీయ నులి పురుగుల దినోత్సవం సందర్భంగా మోడల్ లెవల్ టాస్క్‌ఫోర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం నిర్వహించినట్లే ఈ సంవత్సరం కూడా నులిపురుగుల నివారణ కోసం ప్రభుత్వం పంపిణీ చేసే మాత్రలు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి హరిత, వైద్య సిబ్బంది శిరీష, వెంకటేశ్వరమ్మ, ఎంపీవో కలీం, ఐకేపీ సత్యనారయణ, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ టీచర్స్‌తో పాటు తదితరులు ఉన్నారు.

● కుకునూరుపల్లి: నులిపురుగుల నివారణపై అవగాహన సదస్సును మంగళవారం కుకునూరుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి నమ్రిత్ నిర్వహించారు. ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బందితో అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ నెల 20న నులిపురుగుల నివారణ కోసం మాత్రలను పంపిణీ చేస్తామని, వాటిపై అందరూ అవగాహన కలిగి ఉండాలని ఈ సందర్భంగా ఆమె సూచించారు.



వర్గల్: పీహెచ్‌సీ వద్ద జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న వైద్యాధికారి హరిత



కుకునూరుపల్లి: అవగాహన సదస్సులో మాట్లాడుతున్న వైద్యాధికారి నమ్రిత్



దౌల్తాబాద్: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మాట్లాడుతున్న నాగరాజు



తొగుట: అవగాహన సదస్సుకు హాజరైన సిబ్బంది

● తొగుట: 1 నుంచి 19 ఏళ్ల నిండిన పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు తప్పకుండా వేయించాలని తొగుట ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు రాధాకిషన్ సూచించారు. తొగుట రైతు వేదికలో మంగళవారం ఆరోగ్య, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలకు ఈ నెల 20 వ తేదీన జరుగబోయే జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన సదస్సు నిర్వహించారు. మండలంలో ఉన్న 6,124 మంది పిల్లలకు నులిపురుగుల నివారణ మందులు అందించి రక్తహీనత నుంచి కాపాడాలని సూచించారు. మాత్రలను అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల్లో ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో వైద్యురాలు సాగరిక, సీహెచ్‌వో స్వరూప, సూపర్‌వైజర్ శ్యామల, ఆరోగ్య కార్యకర్తలు, అంగన్‌వాడీ, ఆశ వర్కర్‌లు పాల్గొన్నారు.

●దౌల్తాబాద్: పిల్లలకు ఆరోగ్య వంతమైన జీవితం కోసం నులిపురుగుల మాత్రలను అందించాలని వైద్యాధికారి నాగరాజు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో నులిపురుగుల నివారణ మాత్రాల పంపిణీపై ఏఎన్‌ఎంలకు, అంగన్‌వాడీ కార్యకర్తలకు, అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. చిన్నారుల్లో ఆరోగ్య సమస్యలకు కారణమవుతున్న నులిపురుగులను నివారించేందుకు ప్రభుత్వం ఆల్బెండజోల్ మాత్రాలను పంపిణీ చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంఈవో నర్సవ్వ, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి

- దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి

తొగుట, జూన్ 18: కాంగ్రెస్‌తోనే మారుమూల ప్రాంతాల అభివృద్ధి సాధ్యమవుతుందని కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. మండలంలోని తుక్కాపూర్‌లో మంగళవారం కాశెగుడిసెల కాలనీలో తాగు నీటి ఎద్దడి నివారణ కోసం 40వేల విలువ చేసే బోరుమోటర్‌ను ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. కొన్నేళ్లుగా ఈ కాలనీలో తాగునీటి సమస్య ఉండడంతో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే 40 వేల లీటర్ల సామర్థ్యంతో ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణం కోసం రూ. 30 లక్షల నిధులతో పాటు బోర్ మోటర్ కోసం రూ. 2లక్షల నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన కాలనీ వాసులతో మాట్లాడారు. పిల్లలను పనులకు పంపవద్దని, బడికి పంపి ప్రయోజకులను చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ లతానరేందర్‌రెడ్డి, దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ కోఆర్డినేటర్ చెరుకు విజయ్ రెడ్డి(అమర్), బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గొల్లపల్లి కనకయ్య, నాయకులు విజయ్‌పాల్‌రెడ్డి, లింగాల కృష్ణ, ఉప్పలయ్య, స్వామి, గోపాల్, గోరేమియా, మోదిన్, బాబా, హుసేన్, అమీర్ తదితరులు పాల్గొన్నారు.



బోరుమోటార్‌ను పంపిణీ చేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- సిద్దిపేట డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్

ములుగు, జూన్ 18: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి పుట్ల శ్రీనివాస్ కోరారు. మండల కేంద్రంలోని ప్రాథమిక వైద్య కేంద్రంలో మంగళవారం వైద్య అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలస్థాయిలో టాస్క్‌ఫోర్స్ కమిటీలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వార్డులో చికిత్స పొందుతున్న రోగుల వద్దకు వెళ్లి వారి ఆరోగ్య సమాచారం తెలుసుకున్నారు. అనంతరం ఫార్మసీ స్టోర్‌కి వెళ్లి మందుల పంపిణీ రిజిస్టర్లను పరిశీలించారు. వర్షాకాలంలో వచ్చే అంటువ్యాధులకు ముందస్తు చర్యలుగా మందులను సిద్ధంగా ఉంచుకోవాలని, ల్యాబ్‌లో సేకరించిన పరీక్షల నమూనాలను టీహబ్‌కు పంపించాలని, వివిధ ఆరోగ్య కార్యక్రమాలకు సంబంధించిన డేటా ఎంట్రీని ఎప్పటికప్పుడు హెచ్‌ఐఎంఎస్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. మానసిక రుగ్మతలకు సంబంధించిన సమస్యలపై అవగాహన కల్పించేందుకు టెలిమానస్ ద్వారా ప్రజలకు సేవలు అందించాలని, సమయపాలన పాటించాలని ఆదేశించారు. వారి వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్, వైద్యాధికారి అఖిల, సిబ్బంది ఉన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న పుట్ల శ్రీనివాస్

'నీట్' పేపర్ లీకేజీపై భగ్గుమన్న విద్యార్థి సంఘాలు

- సిద్దిపేటలో ప్రధాని దిష్టిబొమ్మ దహనం

సిద్దిపేట టౌన్, జూన్ 18: నీట్ పరీక్ష పేపర్ లీకేజీపై విద్యార్థి సంఘాలు భగ్గుమన్నాయి. సిద్దిపేట పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద మంగళవారం పీడీఎస్‌యూ, ఎస్ఎస్‌యూఐ, ఎస్ఎఫ్ఐ, యూత్ కాంగ్రెస్ సంఘాల ఆధ్వర్యంలో ప్రధాని మోదీకి వ్యతిరేఖంగా నినాదాలుచేస్తూ, ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌వి. శ్రీకాంత్ మాట్లాడుతూ.. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) నిర్వాకం వల్ల దేశ వ్యాప్తంగా 24 లక్షల మంది నీట్ విద్యార్థులు నష్టపోయారని ఆరోపించారు. ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్, ఎస్ఎఫ్ఐ నాయకులు అజ్మత్, సంజీవ్, వహాబ్ మాట్లాడుతూ.. తక్షణమే నీట్ పరీక్ష ఫలితాలను రద్దుచేసి, ఆ పరీక్ష నిర్వహణను రాష్ట్రాలకు అప్పగించాలని డిమాండ్ చేశారు. నీట్ పేపర్ లీకేజీపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించి బాధ్యులను చట్ట ప్రకారం శిక్షించాలని, కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బీజేపీ ఎంపీల ఇళ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రాషాద్, జిల్లా ఉపాధ్యక్షుడు అజ్మత్అలీ, జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్, జిల్లా కార్యదర్శి భాను, పట్టణ అధ్యక్షుడు సాయిప్రతాప్, అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి నిశాంత్‌గౌడ్, అలీ, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి వంశీ, అరవింద్, ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ నాయకులు రవి, రాజా, క్రాంతి, రాజాబాబు, లక్ష్మణ్, జావిద్, అరవింద్ పాల్గొన్నారు.



చేర్యాల:అర్థనగ్నంగా నిరసన తెలుపుతున్న నాయకులు

● చేర్యాల: నీట్ పరీక్ష అవకతవకలపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ, ఎస్ఎఫ్ఐ నాయకులు మంగళవారం చేర్యాల పాతబస్టాండు వద్ద అర్ధనగ్న ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆముదాల రంజిత్‌రెడ్డి, కార్యదర్శి దాసరి ప్రశాంత్ మాట్లాడుతూ.. సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడుతున్న సమయంలో నీట్ పరీక్ష ఫలితాలు ముందస్తుగా ప్రకటించడంలో పారదర్శకత లోపించిందన్నారు. నీట్ పరీక్షాపత్రం లీక్ అయినప్పటికీ, కేంద్రప్రభుత్వం మొద్దునిద్రపోవడం తగదని, ఎంతోమంది విద్యార్థుల జీవితాలను రోడ్డునపడేసిందని ఆరోపించారు. ఈవిషయమై సుప్రీంకోర్టు జడ్జితో విచారణ చేపట్టి కారకులను కఠినంగా శిక్షించాలని, ఎన్టీఏను రద్దు చేసి నీట్ బాధ్యతలు రాష్ట్రాలకు అప్పగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సుద్దాల భాస్కర్, తాడూరి భరత్, మధు, అజయ్, రాజు పాల్గొన్నారు.

కాంగ్రెస్ విధానాలతో దివాళా అంచుల్లో రాష్ట్రం

- ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, జూన్ 18: కాంగ్రెస్ విధానాలతో రాష్ట్రం దివాళా అంచుల్లోకి వెళ్లిందని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి విమర్శించారు. గజ్వేల్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రుణమాఫీకి ఇన్‌కమ్ టాక్స్‌కు లింక్ పెట్టడం సరికాదన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు జాబ్ క్యాలెండర్‌ను వెంటనే విడుదల చేయాలని, విద్యుత్‌పై, గొర్రెల పంపిణీపై, ఫోన్ ట్యాపింగ్‌పై కాంగ్రెస్ నాయకులు చేస్తున్న ఆరోపణలు అవాస్తవమన్నారు. ఆరు మాసాలుగా అభివృద్ధి, సంక్షేమాన్ని గాలికి వదిలేసి రోజుకో మాటతో పబ్బం గుడుపుతున్నారని మండిపడ్డారు. సిద్దిపేట జిల్లా, రాష్ట్ర అభివృద్ధి కేసీఆర్‌తోనే సాధ్యమన్నారు. డిసెంబరులో ఇస్తామన్న పింఛన్ ఏమైందని, కౌలు రైతులకు, రైతులకు రైతు భరోసా ఏమైందని ప్రశ్నించారు. వారితో జడ్పీటీసీ పంగ మల్లేశం, గజ్వేల్ పట్టణాధ్యక్షుడు నవాజ్ మీరా, గజ్వేల్ ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ ఉడెం కృష్ణారెడ్డి, కౌన్సిలర్లు ఉప్పల మెట్టయ్య, బాలేష్, అత్తెల్లి శ్రీనివాస్, నాయకులు తలకొక్కుల దుర్గాప్రసాద్, ఖాజా విరాసత్‌అలీ, గంగిశెట్టి రవీందర్, మాజీ జడ్పీటీసీ బొల్లారం ఎల్లయ్య, నర్సింగరావు, యాదగిరి, అజిత్, కోఆప్షన్ సభ్యులు ఉమర్, మద్ది నరేందర్ తదితరులున్నారు.



గజ్వేల్ మండలంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతున్న ప్రతాప్‌రెడ్డి

శిథిలమైపోతున్న ఇందిరమ్మ నమూనా గృహం





తక్కువ ఖర్చుతో నిర్మించిన ఇందిరమ్మ నమూనా గృహం, చెదలుపట్టి శిథిలమైన గృహం తలుపులు

మద్దూరు, జూన్ 18: మండల కేంద్రంలో రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో 2014లో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి తక్కువ ఖర్చుతో ఇందిరమ్మ ప్రదర్శన గృహాన్ని నిర్మించారు. అది ప్రస్తుతం వినియోగంలో లేకుండాపోవడంతో శిథిలమైపోతున్నది. ఈ ప్రదర్శన గృహం చుట్టూ పిచ్చి మొక్కలు మొలిచాయి. గృహ నిర్మాణానికి సంబంధించిన ఇందిరమ్మ లబ్ధిదారుల రికార్డులు సెల్ఫ్‌ల్లో, బీరువాల్లో భద్రంగా దాచారు. మండల పరిషత్ కార్యాలయాధికారులు ఇటువైపు కన్నెత్తి చూడకుండా పోవడంతో తలుపులు చెదలు పట్టి పోయాయి. లోపలి సెల్ఫ్‌ల్లోని రికార్డుల్ని చెదలు తినేస్తున్నది. ఇలాగే వదిలేస్తే కొద్ది రోజులకు లబ్ధిదారుల వివరాలు కనిపించకుండా పోయే ప్రమాదముంది. నూతనంగా ఏర్పడ కాంగ్రెస్ ప్రభుత్వం గృహలక్ష్మి పథకాన్ని అమలు చేయనున్న నేపథ్యంలో ఈ నమూనా గృహాన్ని వినియోగంలోకి తీసుకురాకుంటే నమూనా గృహం కనుమరుగయ్యే ప్రమాదం లేకపోలేదు.



చెదలుపట్టిన రికార్డులు

సీఎం చిత్రపటాల అందజేత

మిరుదొడ్డి, జూన్ 18: మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సోమవారం స్థానిక ఎంపీపీ గజ్జెల సాయిలుకు కాంగ్రెస్ మిరుదొడ్డి మండల అధ్యక్షుడు రాజేశం సీఎం రేవంత్‌రెడ్డి, డాక్టర్ బీఆర్. అంబేడ్కర్ విగ్రహాన్ని అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు భూమాగౌడ్, కనకారెడ్డి, మల్లేశం, నర్సింహులు ఉన్నారు.

ఇంపాక్ట్ ఫౌండేషన్ సర్టిఫైడ్ ట్రైనర్‌గా శశిధర్‌శర్మ

జగదేవ్‌పూర్, జూన్ 18: వ్యక్తిత్వ వికాస నిపుణుడు గంప నాగేశ్వరరావు స్థాపించిన ఇంపాక్ట్ క్లబ్ ఆఫ్ ఇంటర్నేషనల్(ఐసీఐ) ట్రైనర్‌గా పీఆర్‌టీయూ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు ఆదరాసుపల్లి శశిదర్‌శర్మ ఎంపికయ్యారు. 45 రోజులుగా ఆన్లైన్ ప్లాట్‌ఫామ్‌లో ఇంపాక్ట్ ఫౌండేషన్ స్ఫూర్తి నిర్వహించిన ట్రైనింగ్‌లో పాల్గొన్నారు. గత శని, ఆదివారాల్లో హైదరాబాద్‌లోని ఓ హోటల్లో నిర్వహించిన టీటీటీడబ్ల్యూఎస్ ట్రైనర్ వర్క్‌షాప్‌లో పాల్గొన్నారు. ఈ వర్క్ షాప్‌లో ప్రదీప్, శ్యామ్ రాథోడ్, ప్రొఫెసర్ విశ్వనాథం శ్రీనివాస్ పెరుమాళ్ల, రామచంద్రుడు దాదాపు 22 మంది ప్రముఖ వక్తలు పాల్గొని శిక్షకులకు ట్రైనింగ్ ఇచ్చారు. ఈ వర్క్‌షాప్‌లో ప్రతిభ కనబరిచిన శశిధర్‌శర్మ ఉత్తమ శిక్షకుడిగా ఎంపికయ్యారు. ఇంపాక్ట్ ఫౌండేషన్ డైరెక్టర్ శ్యామ్ రాథోడ్ చేతులమీదుగా సర్టిఫికెట్ అందుకున్నాడు. న్యూజిలాండ్‌లో ఉన్న బ్యాక్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గంపా నాగేశ్వరరావు ఆన్‌లైన్ వేదికగా శశిధర్‌ను అభినందించారు.

నేడు విద్యుత్ అంతరాయం

వర్గల్, జూన్ 18: మండలంలోని మజీద్‌పల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో నేడు ఉదయం 8.00 గంటల నుంచి 10.30 గంటల వరకు మరమ్మతుల దృష్ట్యా మజీద్‌పల్లి, మాదారం, గిర్మాపూర్, సామాల్లపల్లిలో విద్యుత్‌ను నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ సంతోష్ తెలిపారు.

యూరియా అందుబాటులో ఉంచాలి

- మండల వ్యవసాయ అధికారి మల్లేశం



యూరియా నిల్వలను పరిశీలిస్తున్న ఏవో మల్లేశం

మిరుదొడ్డి, జూన్ 18: రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని మిరుదొడ్డి మండల వ్యవసాయాధికారి మల్లేశం అన్నారు. మిరుదొడ్డిలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సహకార కేంద్రానికి వచ్చే రైతులకు యూరియా, విత్తనాలు అందుబాటులో ఉంచాలని సూచించారు. రైతులకు అన్ని రకాల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పూర్తిస్థాయిలో వర్షాలు పడిన తర్వాతే విత్తనాలను విత్తుకోవాలని రైతులకు సూచించారు. ఆయనవెంట వ్యవసాయ విస్తరణ అధికారి సాయి, సొసైటీ సీఈవో రాజు తదితరులున్నారు.


మల్లన్న ఆలయ ఆవరణలో డ్రైనేజీ లీక్



వెనకదారి మెట్ల ఆవరణలోని మ్యాన్‌హోల్

చేర్యాల, జూన్ 18: కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయ వెనకదారి మెట్ల ఆవరణలోని మ్యాన్‌హోల్ నుంచి డ్రైనేజీ నీరు ఉప్పొంగుతుండడంతో భక్తులు, చుట్టుపక్కల జనావాసాల ప్రజలు ఇబ్బందులుపడుతున్నారు. ఈ విషయమై ఆలయాధికారులకు విన్నవించినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దుర్గంధం వెదజల్లుతుండడంతో ఆలయ ఆవరణలోకి రావడంతోనే భక్తులు ముక్కుమూసుకోవాల్సిన దుస్థితి ఉందని వాపోతున్నారు.

వైకుంఠధామం, పాండవుల చెరువును పరిశీలించిన కమిషనర్



పాండవుల చెరువును పరిశీలిస్తున్న కమిషనర్

గజ్వేల్, జూన్ 18: గజ్వేల్ పట్టణంలోని పాండవుల చెరువు, వైకుంఠధామం పనులను గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ కమిషనర్ గొల్కొండ నర్సయ్య మంగళవారం పరిశీలించారు. అనంతరం గజ్వేల్ పట్టణంలోని 20వ వార్డులో స్థానిక కౌన్సిలర్ గోపాల్‌రెడ్డితో కలిసి డ్రైన్, సీసీరోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. వారితో స్థానిక మునిసిపల్ ఏఈ శ్రీధర్‌రెడ్డి తదితరులున్నారు.

చెట్లను తొలగించిన అధికారులు



చెట్లను తొలగిస్తున్న దృశ్యం

మిరుదొడ్డి, జూన్ 18: విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతున్నదని రైతులు, గ్రామస్థులు విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకురావడంతో సోమవారం విద్యుత్ వైర్ల కింద ఉన్న చెట్లను తొలగించామనని లైన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని లింగుపల్లిలో రోడ్డుకు ఇరువైపుల విద్యుత్ వైర్లకు తుకుతున్న చెట్లను తొలగించినట్లు తెలిపారు. ఆయన వెంట లైన్‌మెన్ కరుణాకర్, సిబ్బంది రమేష్ తదితరులున్నారు.

చెక్‌వాల్ మ్యాన్‌హోల్స్‌కు పైకప్పుల ఏర్పాటు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



చెక్‌వాల్ మ్యాన్ హోల్‌కు ఏర్పాటు చేసిన పైకప్పు

సిద్దిపేట రూరల్, జూన్ 18: సిద్దిపేట-ముస్తాబాద్ రోడ్డు మార్గంలో రోడ్డు ప్రక్కన గ్రామీణ తాగునీటి పైపులైన్ కోసం చెక్‌వాల్ మ్యాన్‌హోల్స్ ఏర్పాటు చేశారు. వాటిపై కప్పులు ఏర్పాటు చేయకపోవడంతో పట్టుతప్పితే ప్రాణాలు హరి అన్న శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి స్పందించిన అధికారులు మ్యాన్ హోల్స్‌పై కప్పులు ఏర్పాటు చేశారు. దీంతో వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గుండెపోటుతో ఆటో డ్రైవర్ మృతి



అంజాగౌడ్(ఫైల్)

మిరుదొడ్డి, జూన్18: గుండెపోటుతో ఆటో డ్రైవర్ మృతిచెందిన సంఘటన సోమవారం మిరుదొడ్డి మండలం ధర్మారంలో చోటుచేసుకున్నది. స్థానికులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అదికం అంజాగౌడ్ (53)అనే వ్యక్తి రోజు ఆటోనడుపుతూ, జీవిస్తున్నాడు. సోమవారం అతడు గుండెపోటుతో మృతిచెందాడు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

నాయీబ్రాహ్మణ సేవా సంఘం ఎన్నికలు



నాయీబ్రాహ్మణ సేవా సంఘం కమిటీ

సిద్దిపేట టౌన్, జూన్18: నాయీ బ్రాహ్మణ సేవాసంఘం సిద్దిపేట జిల్లా ఎన్నికలు మంగళవారం జిల్లా నిర్మాణ కమిటీ, ఎలక్షన్ కమిటీ ఆధ్వర్యంలో సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించారు. ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా కొత్వాల్ యాదా నరేందర్ ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా కొండూరి సతీష్‌కుమార్, కోశాధికారిగా కొండూరి రాజ్‌కుమార్ ఎన్నికైనట్లు కమిటీ సభ్యులు ప్రకటించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు యాదా నరేందర్ మాట్లాడుతూ.. నాయీ బ్రాహ్మణ సంక్షేమం కోసం గ్రామాల్లోని చిట్టచివరి నాయీ బ్రాహ్మణ కుటుంబాలకు సంక్షేమ ఫలాలను అందించేవిధంగా ముందుకు సాగుతానన్ని తెలిపారు. ఎన్నికల అధికారులుగా సింగిరాల కనకయ్య, సింగిరాల శ్రీనివాస్, కొత్వాల చంద్రం, జంపాల విజయ్‌కుమార్, మొలంకల శ్రీనివాస్, కొండూరి అరవింద్‌కుమార్, శ్రీరామ్ బాలనర్సయ్య కొత్వాల్ కిషన్, సూరంపల్లి గౌతమ్, దుంపల బాలా పోచయ్య వ్యవహరించారు. కార్యక్రమంలో నాయకులు ఏల్పుల స్వామి, జిల్లాలోని మండలాల నాయీ బ్రాహ్మణ సంఘం సభ్యులు పాల్గొన్నారు

బీజేపీపై విమర్శలు సరికాదు

- బీజేపీ గజ్వేల్ పట్టణ అధ్యక్షుడు దేవులపల్లి మనోహర్‌యాదవ్



మనోహర్‌యాదవ్

గజ్వేల్, జూన్ 18: బీజేపీపై విమర్శలు ప్రతాప్‌రెడ్డికి సరికాదని బీజేపీ పట్టణ అధ్యక్షుడు దేవులపల్లి మనోహర్‌యాదవ్ పేర్కొన్నారు. గజ్వేల్ పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రధానమంత్రి మోదీని, బీజేపీ నాయకులను ప్రతాప్‌రెడ్డి విమర్శించడం సమంజసం కాదన్నారు. బీఆర్‌ఎస్‌ను ప్రజలు చిత్తుగా ఓడించినా ఆ పార్టీ నాయకులకు అహంకారం తగ్గలేదన్నారు. గజ్వేల్‌లో ఉన్న పెండింగ్ పనులపై దృష్టి పెట్టి ఉంటే ప్రస్తుతం ఈ పరిస్థితి ఉండేది కాదని ఎద్దేవా చేశారు. రింగ్‌రోడ్డు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ఘోరంగా తయారైన గల్లీ రోడ్లు, పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్ల పంపిణీ చేయకపోవడం, బస్టాండ్‌ను అందుబాటులోకి తీసుకురాలేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. విఫలమైన నాయకులు అధికారం పోయాక మాట్లాడడం సిగ్గుచేటన్నారు.

'ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య'



మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

నారాయణరావుపేట, జూన్ 18: ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతున్నదని నారాయణరావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు వడ్డెపల్లి నాగరాజు పేర్కొన్నారు. మండల కేంద్రలో మంగళవారం విద్యార్థులు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యయులతో విద్యాబోధన జరుగుతున్నదని, ఈ విషయాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు గమనించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మనోహర్, శ్రీనివాస్‌రెడ్డి, చంద్రమౌళి, నర్సింహచారి, స్వరూప, పద్మ, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'బడికి పోదాం రండి'



విద్యార్థులను పాఠశాలకు తీసుకెళ్తున్న ఉపాధ్యాయులు

మర్కుక్, జూన్ 18: మీకు పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్, రెండు జతలు యూనిఫామ్స్, మధ్యాహ్న భోజనం ప్రభుత్వం ఉచితంగా ఇస్తున్నది జర బడికి పోదాం రారా చిన్నోడా అంటూ మర్కుక్ మండలం ఎర్రవల్లి ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు తుమ్మ కుమార్, శ్రీశైలం ఊరిబాట పట్టారు. విద్యార్థులు రామ్‌చరణ్, విగ్నేష్ బడికి రాకుండా ఇంటి దగ్గరే ఆడుతున్నారన్న సమాచారం వాళ్ల స్నేహితుల ద్వారా ఉపాధ్యాయులు తెలుసుకున్నారు. ఊరంతా గాలించి వారిని పాఠశాలకు తీసుకెళ్లారు. ఇదంతా గమనించిన గ్రామస్థులు గ్రామంలోని చాలామంది పిల్లలు పాఠశాలకు వెళ్లకుండా చెడు అలవాట్లకు బానిసలయ్యే ప్రమాదం ఉన్నదని, ఉపాధ్యాయులు ఇలా చొరవ చూపడం చాలా సంతోషమని కృతజ్ఞతలు తెలిపారు.

ఇంటి ముందు పార్క్ చేసిన బైక్ చోరీ

జిన్నారం, జూన్ 18: గడ్డపోతారంలో ఇంటి ముందు నిలిపి ఉంచిన బైక్‌ను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. సోమవారం రాత్రి సునీల్ అనే వ్యక్తి తన ఇంటి ముందు స్ప్లెండర్ బైక్‌ను పార్కు చేసి ఉంచగా.. గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. ఇటీవల 15రోజులుగా గడ్డపోతారంలోని పలు వాహనాల బ్యాటరీలను కూడా దొంగలు అపహరిస్తున్నారని స్థానికులు తెలిపారు.

శిఖం భూమి కబ్జాపై అధికారుల విచారణ



శిఖం భూమిని పరిశీలిస్తున్న నీటిపారుదల శాఖ అధికారులు

హత్నూర, జూన్ 18: మండలంలోని బ్రాహ్మణగూడ గ్రామ శివారు చెరువు, కుంటల శిఖం భూమి కబ్జాపై నీటి పారుదల శాఖ ఏఈ వైష్ణవి మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బ్రాహ్మణగూడ గ్రామ శివారులోని అయ్యగారి చెరువు, గునుకుంట, నక్కలకుంటతో పాటు హత్నూర గ్రామానికి చెందిన తాళిమి చెరువు శిఖం భూమిని గ్రామానికి చెందిన కొంత మంది కబ్జా చేసి సాగు చేస్తున్నట్టు గ్రామస్థుల ద్వారా సమాచారం అందడంతో క్షేత్రస్థాయిలో పరిశీలించాన్నారు. కబ్జా చేసిన వారిపై కేసులు నమోదు చేసేందుకు హత్నూర పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు సైతం చేస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఈఈ డిప్యూటీ రవికుమార్‌తో పాటు స్థానికులు ఉన్నారు.